# జానకి రామయ్య

"నేను మీ అత్తారింటికెల్తా రామూ !" లాలనగా అంది జానకి.

"అత్తారింటికా ... దర్జాగా వెళ్ళిరా !" అని ఆలోచనలో పడ్డాడు రామయ్య,

" ..... ..... ..... "

"అరెరే... మీ పుట్టింటికా ... ?" ఐస్‌క్రీమ్ మీద అడుగేసినట్టయింది.

"అవును గదా !"

"ఊహు ! నేనొప్పుకోను జాకీ ?" ఎన్నికైన మరుక్షణమే పార్టీ మార్చిన ప్రజా నాయకుడిలా బదలాయించాడు. చప్పరిస్తున్న చాయ్ వేపరసంలా గన్పించింది. చాయ్‌ను గటగటా తాగేసి ఖాళీగ్లాసును విసిరికొట్టింది జానకి.

కాలివేలు పచ్చడైనా ఓర్చుకుంటూ "మన పెళ్ళయి పట్టుమని పది నెలలు గూడా కాలేదు. అప్పుడే నేనంటే మొహం మొత్తిందా ?" రుసరుస లాడాడు. గుమ్మడి కాయకు గచ్చకాయ లతికించినట్టున్న పెళ్లాం కళ్ళలోకి పెదరసంగా చూశాడు.

పూర్ణంబూరెల్లాంటి దవడల్ని నాజూగ్గా నొక్కుకుంది జానకి... "నీ అవతారాన్ని నేను కాబట్టి పదినెలలు భరించాను. మరొకరైతేనా మొదటిరోజే మొరాయించి చెంగున ఎగిరెళ్ళేది" పడగెత్తిన పాములా బుసబుసలాడింది.

రామయ్య కోపం కుంచించుకుపోయి నవ్వుగా మారింది.

మూడుముళ్ళు పడిన మూడోరోజు ప్రేమ ముదిరితే పేరు పొట్టిదవుతుందన్న సత్యం ఇద్దరికీ ఒకేసారి గుర్తుకొచ్చింది. వెంటనే మూడక్షరాల పేర్లు రెండక్షరాలైనాయి.

"నువు గూడా చెంగున ఎగిరితే చూడాలనుంది జాకీ !"

"వెవ్వెవ్వె..." వెక్కిరిస్తూ కొంగు నడుముకు బిగించబోయింది. నడుం సైజుకు కొంగు సరిపోలేదు.

రామయ్యలో పౌరుషం పొంగుకొచ్చింది. "పోవే రోడ్డు రోలరూ !" కవ్విస్తూ ఖాళీబిందె అటు విసిరాడు.

"పోతానోయ్ దున్నపోతూ !" వంటపాత్రనిటు విసిరింది.

రెండూ పైన ఢీకొని నేలమీద పడిపోయినై. అదే వరుసలో తప్పాలాలు, చెంబులు, గ్లాసులు, ప్లేట్లు ... ఎగిరిపడుతున్నయి.

కొత్త అద్దింట్లోకి మారి వారం కాలేదింకా. పక్క పోర్షన్ పరమేశం "ఏనుగు

గున్న, ఎలుగుబంటిలా ఈడూజోడు బాగానే ఉందిగానీ ఇదేమిటటా ?" భార్యనడిగాడు.

"వెంటనే వెళ్ళి ఆ మూడో ప్రపంచ యుద్ధాన్నాపేద్దాం రండీ !" శ్రీమతి పరమేశం బయలుదేరింది. పరమేశం పరుగెత్తాడు. ఎదురుగా ఇత్తడి గుండిగ పాశుపతంలా గొచ్చింది. శ్రీమతి పరమేశం మొహం చింతకాయ పచ్చడైంది. ఖాళీ ప్లేటు విష్ణుచక్రంలా ఎగిరొచ్చి పరమేశం చెంపకు గాటు పెట్టింది.

లబోదిబోమన్నారు. గాలికి పోయే కంపను వేలికి తగిలించుకున్నట్టయిందని కుయ్యో మొర్రోమని మొత్తుకున్నారు.

❋ ❋ ❋

అప్పుడెప్పుడో జానకి డిగ్రీ ఫైనల్లో ఉన్నప్పుడో రోజు బక్కపల్చని పద్మిని, ఐదున్నర అడుగుల ఆదిలక్ష్మితో కలిసి బస్టాండుగుండా హాస్టల్‌కెళ్తోంది. బస్టాండులో కొత్త వెయింగ్ మిషన్ కనబడింది.

"మన బరువెంతో మనకే తెలీదు. తెలుసుకుందాం పదండీ" ఆదిలక్ష్మి ప్రపోజ్ చేసింది. పద్మిని బలపరిచింది.

పైటలాగి నడుముకు బిగించుకొని మెషిన్‌మీదికెక్కింది పద్మిని. ముప్పయి కేజీలు.

"అయ్యో పాపం ! అందుకే సుడిగాడుపొస్తే కొట్టుకుపోయేట్టున్నావు" ఆమెను దింపేసి ఆదిలక్ష్మి నుంచుంది. అరవై కేజీలు.

"నీకు క్వింటాల్ బరువున్న మొగుడైతే బాగుంటుందే !" గొల్లున నవ్వింది పద్మిని. వెంటనే జానకి ఆమె నెత్తిమీదో మొట్టికాయిచ్చింది. అది సుత్తిదెబ్బలాగుంది. కెవ్వు మంది పద్మిని. ఆ తర్వాత "ఇప్పుడు నీవంతు" అంటూ జానకి జబ్బమీద చెయ్యేసింది.

ఇద్దర్నీ ఇబ్బందిగా చూసింది జానకి. "తప్పదా ?"

"తప్పదంటే తప్పదు" జబ్బ ఊపింది. జానకి కాలు ఆదిలక్ష్మి కాలుమీద పడింది. అది ఏనుగు పాదంలాగన్పించి "వామ్మో" గావుకేకేసింది. జానకి పుస్తకాలు లాక్కుని మెషన్ ఎక్కమంది.

"మీ ఇష్టం" అంది జానకి. వోణీ సవరించుకొని వెయింగ్ మెషన్ మీద నిలబడింది. అంతే మెషీన్ చక్రం విష్ణుచక్రంలా గిర్రున తిరిగి విరిగిపడి పోయింది. ఇద్దరి నోర్లూ కారు డోర్లలా తెరచుకున్నాయి. ఎవరన్నా చూస్తే ఏమైపోతుందో !

"హమ్మోయ్ ! మెషన్ బుజ్జిముండ. నీ బరువు దీనికి తలకు మించిన భారమైందే" పద్మిని గుండెలు బాదుకుంది. ఆదిలక్ష్మి హడలిపోయింది.

"నేను ముందే వద్దన్నాను. మీరే వినలేదు" అంటూ జానకి చెరోమొట్టికాయివ్వ బోయింది. అదృష్టవశాత్తూ ఇద్దరూ తప్పుకున్నారు.

"దీని బరువు క్వింటాళ్లలో తప్ప కిలోలకందదే" ఆదిలక్ష్మి చెవిలో అంది పద్మిని. ఇంకా అక్కడే ఉంటే ఏమైనా జరగొచ్చు. గిరుక్కున ముగ్గురూ వెనక్కి తిరిగారు. ఆకాశమ్మీ దుండాల్సిన అంత పెద్ద మేఘం ఎదురుగా ఉంది. మూడు జతల కనురెప్పలు టపటప లాడినై.

"నేనంతా చూశానండీ !" మాట్లాడిందా ఆకారం. మేఘం కాదది. నీలిమేఘం దేహఛాయలో టక్ చేసుకున్న యువకుడు.

"నా పేరు రామయ్య, సన్నకారు ప్రభుత్వోద్యోగిని." ఏనుగు కళ్ళను లాఘవంగా తిప్పుతూ "ఆఫీసునుండి రూంకెల్తుంటే మీరు కనబడ్డారు. ఆగిపోయానంతే." స్వపరిచయం చేసుకొని నవ్వుతూంటే ... అప్పుడు తెలిసింది నోరు ఫలానా చోటుందని.

"ఐతే మా వెంట పడ్డారన్నమాట ..." వయ్యారంగా పద్మిని వోణీ సర్దుకుంది. "అడ్డంగా ఎంత పెరిగినా ఏం లాభం ? పోలీసుల్ని పిలిస్తే వీపు విమానం మోత మోగుతుంది." బింకంగా అంది.

"అయ్యయ్యో ! నేనలాంటి వాణ్ణి కాదండీ" హడలిపోయాడు.

"అబ్బా... పాపం వద్దే !" జానకి జాలిగుండె కరిగి గండిపేట చెరువైంది. కనురెప్పలు కలువరేకుల్లా కదిలినై.

"థాంక్సండీ ... మీ్మ ... మీ... ప్పే ... పేరు ?" తత్తరపాటుతో రామయ్య మొహం రంగులచిత్రమైంది.

"నా పేరూ ... జజ... జానకి" బుగ్గలు సిగ్గులారబోసినై.

"ఆ మిషన్ నిన్ననే పెట్టారండి" రామయ్య వింత పులకింతలు.

"ముందు నా వెయిట్ చూడాలన్నారు. సరేనన్నాను. నిన్నగూడ ఆ చక్రం ఇలానే విరిగిపడింది. రిపేర్ చేసి పెట్టారట"

జానకి గుండెలో రామయ్య జాబిల్లిలా సెటిలయ్యాడు.

"సరే ... మరోసారి కలుద్దామండీ" చెయ్యూపాడు.

"ఒకే... బాయ్ బాయ్" జానకి ముసి ముసి నవ్వులు. మర్నాడు గూడా అదే స్పాట్‌లో కలయిక.

ఆర్డరిచ్చిన పూరీ - చికెన్ వచ్చేదాకా కబుర్లుచెప్పుకున్నారు. రెండు ప్లేట్ల పూరీలు, ఒక డిష్‌లో చికెన్ ఫ్రై మరో డిష్‌లో పప్పు పెట్టేసి థ్రిల్లింగా చూస్తూ ఉండిపోయాడు బేరర్.

దొరక్క దొరక్క నాకో గర్ల్‌ఫ్రెండు దొరికింది. వీనికేం దురదనో ... రామయ్యకు సుర్రుమంది. "ఏందీ ... తమాషా చూస్తున్నావా ?" గుర్రుమన్నాడు. బేరర్ మెదడు నరాలు కదిలిపోయినై. ఒక్కటే పరుగు.

ఇద్దరూ భళ్ళున నవ్వారు. గుసగుసలాడ్తున్న వాళ్ళ గుండెల్లో బాంబులు పేలినై. కొంటె చూపులు విసురుతూ పూరీ మీదకు చికెన్ నంజుకుని లాగించేస్తుంది జానకి. రామయ్య చూస్తున్నాడు.

చికెన్ డిష్‌లో మాంసం ముక్క ఒక్కటి గూడా మిగలకుండా ఖాళీ అయింది. పప్పుగిన్నెమీద చెయ్యేసింది. అప్పుడు గుర్తుకొచ్చింది.

ఇంకాస్సేపైతే ఇసుమంత పప్పుగూడా మిగలదని. చెరిసగమనుకున్న చికెన్... పూర్తిగా ఐపోయింది. జానకినో ఆటపట్టించాలనుకున్నాడు. ముందుకు వంగి పూరీ అందుకుంటూ "మీ ఊళ్ళో కుక్కలేం తింటాయండీ ... మా ఊళ్ళోనైతే మాంసం తింటాయి" అడిగాడు.

"మా ఊళ్ళో కుక్కలు పప్పు తింటాయండీ" చీమ కళ్లను దోమ రెక్కల్లా తిప్పుతూ పప్పుగిన్నె అతని ముందుకు తోసింది.

హమ్మో చలాకీ పిల్లనే .... రామయ్య మొహం మాడిన ముద్దపప్పులాగైంది. గుటక వేయడం వినా ఇంకేమనలేక పోయాడు.

"సారీ డియర్ !" ముక్కును చిలిపిగా లాగి వదిలేసింది. ముద్ద పప్పుమొహం ముద్దబంతిలా విచ్చుకుంది.

అలా చాలా సార్లు కలుసుకున్నారు. మాటల మధ్య ఆవిడ లేడీస్ హాస్టల్‌లో ఉంటున్నట్టు అతడు అద్దెగదిలో ఉంటూ హోటల్లో తింటున్నట్లు తెలిసిపోయింది.

పార్కులో ఓ రోజు "మీకు వంట చెయ్యడమొచ్చా" లాలనగా అడిగింది.

"అంటే నీకు రాదా ?" తర్వాత తననో వంటింటి కుందేలుగా మార్చేస్తుందేమో నని భయమేసింది. చేతులున్న ఐస్‌క్రీమ్ జారుతోంది.

"ఛీ చిలిపి. అది కాదు డియర్. ఇప్పట్నుంచే వంట చేసుకుతింటే డబ్బు ఆదా... మన పెళ్ళి ఖర్చులకు, హానీమూన్‌కు... " చెంపగిల్లింది. తేటుకుట్టినంత

మంట... ఓర్చుకోలేక తప్పలేదు.

"అదంతా ఎందుకు ? మీ లేడీస్ హాస్టల్లో సీటిప్పించు ..."

"అయ్యో ... ఆశ !" మరో చెంప గిల్లబోయింది. భళ్ళున నవ్వుతూ తప్పించుకున్నాడు. పక్కనున్న జంట పరుగో ... పరుగు. అప్పటికే రాత్రి తొమ్మిదైంది.

అలా గడిపేశాక రామయ్య హోటల్‌కెళ్ళి బేరర్‌ను భోజనం తెమ్మన్నాడు. హోటల్ ఓనర్ వచ్చి "మీకు ఫుల్ భోజనం పద్ధతి ... మాకు చాలా నష్టం సార్. ప్లేటు సిస్టంలో తినండి సార్" చేతులు కట్టుకు నుంచున్నాడు.

"ఏం... ఎందుకట్లా. నేను రోజూ ఇక్కడే తింటున్నాను ...."

"మాకు రోజూ నష్టం వస్తుంది సార్. నలుగురి ఫుల్ భోజనం మీ ఒక్కరికే అవుతుంది సార్. సారీ ... సారువారూ"

ఎంత బతిమాలినా లాభం లేదు. సాధ్యమైనంత త్వరగా పెళ్ళి చేసుకోవాలి. ఇంకో నెలైతే జానకి పరీక్షలైపోతై !... నిర్ణయం పెద్దలదాకా వెళ్ళింది. పెద్దలు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు.

అటు పరీక్షలవగానే ఇటు భజంత్రీలు మోగినై. బంధుమిత్రులు "ఆహా ! అద్దం, పొడవులో ఒకరికొకరు తీసిపోరు. చూడముచ్చటైన జంట..." చెవులు కొరుక్కుంటూ అక్షింతలు చల్లేశారు.

మూడు రాత్రులయ్యాక మూడువారాల హనీమూన్ ... ముచ్చటగా ముగిసింది. గోవా బీచ్‌లో తియ్యని అనుభవాలవి.

***

సంధి కుదిర్చి సముదాయించాలని వచ్చిన పరమేశం దంపతులు పరాభవాన్ని దిగమింగుకున్నారు. "ఎర్రక్కపోయి వచ్చాము, ఇరుక్కుపోయాము" అనుకుంటూ లెంప లేసుకుంటూ జారుకున్నారు.

పాత్రలతో యుద్ధం మరో పావుగంట సాగింది. విసురుకునేందుకింకేమీ మిగల్లేదు. రోషం రుసురుసలాడ్తూనే ఉంది. మూలకున్న టీవీ అందుకోబోయింది జానకి. కళ్ళూ ఒళ్ళూ గిర్రుమన్నయి. అంతే బోర్లాపడిపోయింది. రామయ్యకు... స్విచ్ వెయ్యబోయి కరెంట్ షాక్‌కు గురైనట్టయింది.

"అయ్యో ... ఏమైంది జాకీ !" జబ్బపట్టి కుదిపి వెల్లకిల చేశాడు. ఉలుకూ

పలుకూ లేదు. అంతా దొంగాటకం !... పళ్ళు కొరకబోయాడు. కింది పెదవి పళ్ళ మధ్య ఇరుక్కుపోయింది. నెత్తి కొట్టుకున్నాడు. గున గునా వెళ్ళి ఆటో తీసుకొచ్చాడు.

"మీ ఇద్దరికైతే మీటర్ డబుల్ ఛార్జి ఇవ్వాలె సార్ !" ఆటోవాలా. కండిషన్ ఒప్పుకోక తప్పలేదు.

హాస్పిటల్లో లేడీ డాక్టర్ పేషెంటును చూసి ముందు పరేశానైంది. ఆ తర్వాత తేరుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

"అయ్యో ... నాకు కాళ్ళూ చేతులూ ఆడ్డంలేదు డాక్టర్. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు" రామయ్య అంతరాళాల్లో సునామీ అలలు. కాళ్ళూ చేతులు తుఫాను గాలిలో తుమ్మకొమ్మల్లా వణుకుతున్నయి.

మొహమ్మీద నీళ్ళు చల్లింది నర్సు. నిద్ర వదులుతున్నట్లు కదిలింది జానకి.

"నేనెక్కడున్నాను ?" మెల్లగా మూల్గింది. కళ్ళు తెరిచి చూసింది.

"ఏం ఫరవాలేదు. అలాగే పడుకో" అంది డాక్టర్. నాడి పరీక్షించింది. ఆ తర్వాత రామయ్యను కిందినుంచి మీద్దాకా చూసి "మీరు బయటకెళ్ళండి" అంది స్టెతస్కోపు అందుకుంటూ, వెనక్కు తిరిగి చూస్తూ బయటికెళ్ళిపోయాడు. ఓ నర్సు మరో నర్సు చెవిలో "అచ్చం ఎలుగుబంటి నడిచినట్టుందే" గుసగుసలాడింది. ముసిముసి నవ్వుల్తో సరిపెట్టుకున్నారు.

తిరిగి పిలిపించింది డాక్టర్.

"నా భార్యకేమైంది డాక్టర్ ?" ఆబగా అడిగాడు.

"ఏమీ కాలేదు" మళ్ళీ నవ్వింది.

"మేమంటే మీగ్గూడా నవ్వులాటగా ఉందా డాక్టర్ ?"

"కాదండీ ... ప్రమాదమేమీ లేదు ..."

ఇది వేళాకోళమా ! గొంతు సవరించుకొన్నాడు. "ఇంతకీ ఏమైంది డాక్టర్ ?"

ఈలోగా జానకి గూడా వచ్చి పక్కన నుంచుంది.

"ముందు మీరు కూచోండి" కలమందుకొని గదవకానించుకుంటూ కళ్ళతో కుర్చీలు చూపించింది. ఇద్దరూ కూచున్నారు. డాక్టర్ ఏం చెబుతుందోనని మొహాలు చూసుకున్నారు.

"కంగ్రాట్స్..." డాక్టర్ నవ్వింది. "ఆవిడ తల్లికాబోతుంది. మీరు తండ్రి కాబోతున్నారండీ. మందులు రాసిస్తాను, జాగ్రత్తగా వాడుకోవాలి."

"థ్యాంక్యూ డాక్టర్ !" సంతోషంగా లేచి కరచాలనానికి డాక్టర్ చెయ్యందుకో బోయాడు. చెయ్యి వెనక్కు లాక్కుంది డాక్టర్.

"మీరు కూచోండి సార్". నర్సు కూడా నవ్వింది. "మీది ముచ్చటైన జంట... జానకి రామయ్య .... ఆహా ! లక్కీ సార్ !" అభినందించింది.

జానకి ఒంటినిండా పులకింతలు పూచినై. సిగ్గుల భారంతో పొంగిన పూరీల్లాగైన బుగ్గల్ని అరచేతుల్తో తడుముకుంటూ రామయ్య కళ్ళలోకి చూసింది..

"అమ్మో ... మా ఆయన అసాధ్యుడే" అనుకుంది.

మురిపాలు మూటగట్టుకుంటున్న రామయ్య "మా జాకీ మామూలు మనిషి కాదు" కళ్ళతో అభినందించాడు.

డాక్టర్ మందులు రాస్తోంది. రామయ్యలో ఆనందసాగరం. జానకి చెవిలో "ఇహ పురిటికే గదా పుట్టింటికెళ్ళేది." అనేశాడు.

బలమందుకున్న సిగ్గులతో చెంపలుకెంపులైపోతుంటే జానకి చూపులు నేలకు వాలినై.

"ఎవరి శరీరమెట్లా ఉండాలనేది సృష్టి రహస్యమేకాని అదేమిటో ... మానవనైజం ఓ విచిత్రం. మీరేమీ అనుకోవద్దండీ !" డాక్టర్ సలహా.

***(ఆకాశిక్, 16-31 మార్చి, 2006)***